# డాక్టరు చంపిన రోగి

అలసిపోయి ఇంటికి వచ్చిన శేఖరం మనసంతా వికలమైపోయింది. టేబిల్ మీద ఉత్తరాల కట్టలోంచి ఒక ఉత్తరం అతన్ని వెక్కిరించి వేధించింది.

'ఇంక బ్రతుకు తాననే ఆశ లేదు ఒకసారి కనిపించరూ!'

ఆ వాక్యం చెవుల్లో గింగురు మంటోంది.

ఆర్ద్రంగా చూసే కమల కళ్ళు... అల్లరితో కవ్వించే ఆమె ప్రవర్తన — తన మనస్సు దోచుకోవాలని భీష్మించుకుని నాలుగైదు సంవత్సరాలు పరిణయమే మానుకున్న ఆమె — కళ్ళముందు కదిలింది దీనంగా. కమలను వివాహం చేసుకోలేదని ఆమె తలిదండ్రులకు కోపమే. కాని శేఖరం ఏం

చేస్తాడు? తన జీవితంలో రెండు సంవత్సరాలు ఆలస్యంగా పరిచయ మైనందున ఆమె అభిమానాన్ని అర్థం చేసుకున్నా జీవితంలో దగ్గరకు చేర్చుకుని ఆదరించలేకపోయాడు శేఖరం. శేఖరం మనస్సు మరీ వికలమై పోయింది.

మరణశయ్యమీద వున్న కమలను చూడ్డానికి వెళ్ళేటప్పుడు, ఆమెచుట్టూ వున్న పరివారం అతన్ని ఏవగించుకుంటుంది. "చచ్చేటప్పుడైనా చూడడానికి వచ్చావా?" అని హేళన చేస్తుంది. అన్నీ దిగుమింగుకోవాలి. అయినా కమల మాత్రం ఆనందంగా ఎదురు చూస్తుంది — ఆప్యాయంగా ఆహ్వానిస్తుంది.. ఎల్లా వుందో... చూసి రెండేళ్ళయి పోయింది... సంసార బాధ్యతలు నెత్తిన వేసుకున్న స్త్రీలో విపరీతమైన మార్పు వస్తుంది... కమల ఎలావుందో... బాధ పొందిన శేఖరం బలవంతంగా దిగమ్రింగుకున్నాడు దుఃఖం.

సాయంత్రం కనుచీకటి పడింది. కమల ఇంటివైపు నడిచాడు శేఖరం. ఆ పెద్ద బంగళా ప్రశాంతంగా వుంది. కమల తండ్రి కుర్చీలో కూర్చుని కాంపౌండు తోటలో వార్తాపత్రిక చదువుతున్నాడు. "నమస్తే" అన్నాడు శేఖరం. కమల తండ్రి అతన్ని ఆపాద మస్తకం విచిత్రంగా ఎవరో కొత్తమనిషిని చూస్తున్నట్లు చూశాడు. ముక్తసరిగా పలకరించి ముఖం త్రిప్పుకున్నాడు. ఆయన ముభావం శేఖరానికి క్రొత్త అనిపించలేదు. తనవంటి ధనికుని కూతురు పెళ్ళి చేసుకుంటానని వస్తే ఆస్తిపాస్తులు లేని శేఖరం ఎందుకు

వివాహం చేసుకోడో! "ఇది గర్వ'' మని కమల తండ్రి అక్కడక్కడ అన్నమాటలు శేఖరానికి గుర్తే.

నిశ్శబ్దంగా లోనికి అడుగు పెట్టాడు. వసారాలో విద్యుద్దీపం వెలుగుతోంది, కమల మంచంమీద పడుకుని వుంది, దగ్గర ఎవరూ లేరు. మంచం ప్రక్కనే చిన్న టేబిల్ మీద మందుసీసాలు కనిపించాయి.

"కమలా''

కలతగా మంచంమీద దొర్లుతున్న కమల కళ్ళువిప్పి చూసింది హఠాత్తుగా ఆయాసంగా లేచి కూర్చుని శేఖ రాన్ని ఆహ్వానించింది.

"పడుకో కమలా! లేవకు!'' శేఖరం మంచం దగ్గరగా జేరి కుర్చీలో కూర్చున్నాడు. "ఏమిటి జబ్బు? ఎలావుంది!" నుదురు పట్టుకుని చూశాడు శేఖరం.

కమల మందస్మితం చేసింది. ఆ మందస్మితంలో ఏవో పురాతన తలపుల సాఫల్యం సిద్ధించినంత గర్వపడింది కమల.

"టైఫాయిడు ... రెండుమూడు రోజులక్రితం 104, 105 డిగ్రీలు వుంది... ఈ వేళ కొంచెంనయం ... చూడు శరీరం ఎలా కాగుతోందో!... నానా, అమ్మా ఐస్ బేగ్ పెట్టి రాత్రల్లా కూర్చునేవారు... ఏమిటో జ్వరం వచ్చినప్పటి నుంచీ నాకు బ్రతుకు తాననే ఆశలేదు శేఖర్!... అందుకే

నీకు వుత్తరం రాశాను... మృత్యువు నాకు దగ్గరగా వచ్చి నిలుచున్నట్లనిపిస్తోంది?''

"భయపడకు కమలా!... జ్వరం తగ్గిపోతుంది... ఎవరు మందిస్తూంట?''

"ఒక లేడీ డాక్టరు... ఆమె వచ్చే టయిమయింది."

"ఊహూఁ..." నవ్వాడు శేఖరం,

"ఒక బత్తాయి వలిచి పెట్టనా?" కమల టేబులుమీది పండు తీసింది

"అబ్బే నాకెందుకు ! దానిపేరు జ్వరంపండు... అది తీసుకుంటే నాకే జ్వరం వస్తే...''

"సరేలే! ... నేనిచ్చేది తీసుకోడం నీ కిష్టం లేదన కూడదూ !"

"అది కాదు కమలా... ఆపండు యియ్యి నేనే వలిచి పెడతా !"

"ఈ వేళ చాలా హాయిగా వుంది శేఖరం...ఇప్పుడు చనిపోయినా ఫరవా లేదనిపిస్తుంది...ఇలా ప్రమాదమైన పరిస్థితిలో వుణ్ణాననికదూ నువ్వు చూడ్డానికి వచ్చావు! లేక పోతే వస్తావా? .. రావు ..." శ్రమ తీర్చుకుంటున్నట్లు కాళ్లు చాపుకుని విరామంగా మంచంమీద పడుకుంది కమల.

కమల తల్లి వసారాలో మాటలువిని ఎవరు వచ్చారో చూద్దామని లోనికి అడుగు పెట్టింది. శేఖరాన్నిచూసి

ముఖం చిట్లించుకుని, ఏమనలో అర్థంకాక 'ఏంబాబూ! ఇలా వచ్చావు?' అని అడిగింది. 'ఎవరు రమ్మన్నారని' కుండ బ్రద్దలు కొట్టినట్లు. 'కమలకు ఒంట్లో బాగాలేదని చూడ్డానికి వచ్చాను' శేఖరం తనకు కమలరాసిన ఉత్తరం సంగతి కప్పిపుచ్చాడు.

"ఇంత అభిమానం వుందని మాకు తెలియదే!"

"అమ్మా" అని కసిరింది కమల. రుసగుసలాడుతూ అక్కడనుంచి నిష్క్రమిస్తున్న తల్లి వైపుచూసి.

కూతురు కేక విన్న తండ్రి ఒకసారి వసారాలోకివచ్చి తొంగిచూసి, ఏదో చిన్నఘర్షణ అయివుంటుందని తన్ను తాను సముదాయించుకొని వెనక్కు వెళ్ళిపోతూ "మందు తీసుకునే వైనుయిందిగా" అన్నాడు ముభావంగా.

'డాక్టరు రానీ!' కమల తల త్రిప్పుకుని ముభావంగా సమాధానం ఇచ్చింది.

కమల తండ్రి కాంపౌండులోని తోటలో పచారు చేయడానికి వెళ్ళిపోయాడు.

శేఖరం బత్తాయి వలిచి ప్లేటులో వుంచాడు.

'తిను' అంది కమల నవ్వుతూ.

'నీకోసం' నవ్వాడు శేఖరం.

'నువ్వు తింటేనే నేనూ తింటా'.

'ఊఁ కానీ !'

ఇద్దరూ చెరో తొన తిన్నారు.

కాంపౌండులో కారు హారను మ్రోగింది. మరు క్షణంలో లేడీడాక్టరుతో కమలతండ్రి లోపలికి వచ్చాడు.

వసారాలో అడుగుపెట్టిన డాక్టరును చూసి శేఖరం, శేఖరాన్ని చూసిన డాక్టరూ ఒక్కక్షణం ఆశ్చర్య చకితులై పోయారు. అయినా ఒకరితో నొకరు మాట్లాడుకోలేదు. శేఖరం కుర్చీలోంచి లేచి నిల్చున్నాడు. లేడీడాక్టరు కుర్చీలో కూర్చుంది. కమలను పరీక్షించింది. ఏవో ప్రశ్నలు వేసింది. కాస్సేపు కమల తలిదండ్రులతో రోగి ఆరోగ్యం గురించి ప్రస్తావించింది స్టెతస్కోప్ మెడలో వేలాడించు కుంటూ వయ్యారంగా లేచి నిలుచుంది వెళ్ళడానికి. తెచ్చి పెట్టుకున్న ముసి ముసి నవ్వులతో కమలను ఏదో విచిత్రంగా నవ్వించ ప్రయత్నించింది. ఇది శేఖరం గమనిస్తూనే వున్నాడు... డాక్టరు వసారావిడిచి వెళ్ళిపోయింది. గుమ్మం దాటి వెనక్కి అడుగువేసి శేఖరాన్ని చూసి 'మీరు ఇక్కడే వుంటున్నారా ?'

'అవునండీ!' ఎవరో క్రొత్త మనిషికి సమాధానం చెప్పేటట్లు తీవ్రంగా ముఖం పెట్టేడు శేఖరం.

'బయటికి వస్తున్నారా? కారులో ఎక్కడైనా దారిలో దింపుతా.'

'లేదండి ఇంకా కాస్సేపుంటా... మీరు వెళ్ళండి!'

బాహ్యంగా డాక్టరు మందస్మితం చేసినా లోలోపల బాధ పడినట్లు గుర్తించాడు శేఖరం.

'వెళ్ళకూడదూ... కారులో దింపుతారుగా!' అంది కమల తల్లి. డాక్టరు వసారా నుంచి నిష్క్రమించాక.

కమల తండ్రి డాక్టరును సాగనంపి తిరిగి వసారాలోకి వచ్చి కూతురుకు మందిచ్చాడు అంతా నిశ్శబ్దం.

డాక్టరు శేఖరాన్ని పలకరించిన దృశ్యం కమలకు కొంచెం ఆశ్చర్యం కలిగించినా, వారు ఒకరి నొకరిని ఎరుగుదు రేమో అని సమాధాన పరచుకుంది.

శేఖరం మనస్సంతా ఆలోచనలతో తికమక అయ్యింది. ఆ ఆలోచనావేశంలో బాహ్యంగావున్న కమలను, ఆ యింటి దృశ్యాన్ని కూడా ఒక క్షణం మరిచి పోయాడు. ఏదో ఆవేశంతో నిట్టూర్పు విడిచాడు.

"మా ఖర్మ ఎలా వుంటే అలా జరుగుతుంది... మా కెవరి సాయం అక్కర్లేదు ... కాస్త కమలను పడుకోనీ... వెడతావుటోయ్ !" అంది కమల తల్లి దురుసుగా!

"నేను రమ్మంటే ఆయన వచ్చారు ?" అరిచింది కమల కోపంగా.

ఆ దృశ్యం చూసిన కమల తండ్రి ఏమీ జోక్యం కలిగించుకోలేదు.

వెడతానని శేఖరం నిలుచున్నాడు.

"మళ్లీ రేపు రావాలి..." కమల ఏదో ఆజ్ఞ ఇస్తున్నట్లు మంచంమీద లేచి కూర్చుంది.

"నువ్వు రమ్మంటే నీ ఆరోగ్యం బాగుపడేదాకా వస్తాను."

"...కాదు నేను చనిపోతాను... అంతవరకు!"

శేఖరం నవ్వాడు.

"అది సాధ్యపడదు... నీకు చాలా తెలివైన డాక్టరు మందిస్తోంది... ఆమె ఎవరినీ చంపదు... యిప్పుడు... ఎందుకంటే ఆమె చేతుల్లో చనిపోవలసిన వాళ్ళు యిదివరకే చనిపోయారు!"

అతని హాస్యంలోని అంతరార్థం కమల పసికట్టలేక పోయింది. సలసల కాగుతున్న శరీరం జ్వరం తీవ్రతలో ఆమెకు నీరసం, తలత్రిప్పు కలిగింది. ఒక నిట్టూర్పుతో మంచంమీద ఒరిగిపోయింది కమల. శేఖరం బరువుగా అడుగులు వేస్తూ నిష్క్రమించాడు.

* * * *

కమల ఆరోగ్యం బాగుపడుతుందని అంతా ఆశించారు. జ్వరం బాగా తగ్గుముఖంపట్టింది. కమల పెదవుల మీద నీరసం నవ్వులు కనిపిస్తున్నాయి. శేఖరం రోజూ సాయంత్రంవచ్చి ఒకసారి కమలను పలకరించి పోతున్నాడు.

ఆ రోజు సాంత్రం కమల భర్తకూడా వచ్చాడు ఆమెను చూడడానికి. కాస్సేపు వారిద్దరూ సంభాషణ ముగించాక వెడతానని శేఖరం లేచాడు. ఎక్కడనుంచి తెప్పించుకుందో పెట్టుకున్న మల్లెపూలు గుప్పున వాసనలు వెదజల్లుతున్నాయి. వరండా దాటి వీధి గుమ్మంలోకి వచ్చే దాక శేఖరానికి తెలియలేదు వాన పడుతోందని. అలవాటు ప్రకారం కమల తల్లి వంటింటిల్లో ముడుచుకు పోయింది తండ్రి యింట్లో లేడు.

"వాన పడుతోంది కాస్సేపు కూర్చోండి" అన్నాడు కమల భర్త. చీకటి ఆకాశంనుంచి జారుతున్నా వాన సందడి చూసి హాయిగా నవ్వుకుని మరికొంతసేపు ఉండిపోదామని వెనక్కు మళ్ళాడు శేఖరం.

డాక్టరు వచ్చింది కారులో. కారుదిగి వసారాలోకి వస్తుండగా తలమీద రాలిన తుంపరలు తుడుచుకుంటూ నవ్వుతూ లోన అడుగు పెట్టింది. మొదటిసారి కమల చూడ్డానికి వచ్చినప్పుడే డాక్టరుని చూడటం. మళ్ళీ యిప్పుడు రాగానే ఆమె ఆశ్చర్యంగా అతన్ని పరిశీలించింది ముభావంగా కమలను పరిశీలించి, యథా ధోరణిలో ఆమె ఆరోగ్యం బాగుపడుతుందని హెచ్చరికచేసి, కమల బుగ్గ మీటింది. ఆ ఆడవాళ్ళ సరసం చూసి కమల భర్త నవ్వుకున్నాడు.

"మీ ఆవిడ చాలా మంచిపిల్లండీ! అదృష్టవంతులు! నవ్వింది డాక్టరు. చెప్పినట్లు మందు తీసుకుంటుంది. ఇంజెక్ష

నిస్తే అల్లరిచేయదు. ...అందుకే జ్వరం చాలా త్వరగా తగ్గిపోయింది... మొదటిలో రోగికంటె, నాకే ఎక్కువ కంగారు పుట్టింది. ఆమె ఆరోగ్యం చూస్తూంటే!... తన సంచీ లోంచి ఏదో పౌడర్లు తీసి అందిచ్చింది. కమలభర్త అందు కున్నాడు. ఆ పౌడర్లు సేవించే వైనం ఏకరువుపెట్టి, నిష్క్ర మిస్తాననే ధోరణిలో లేచి నిలుచుంది డాక్టరు. శేఖరం వసారా కిటికీలోంచి బయట వానజల్లుచూస్తూ నిలుచున్నాడు. 'డాక్టరుగారూ ! మా శేఖరంగారిని అలాబజారుదగ్గర కానీ, బస్సుస్టాండు దగ్గరకానీ దింపరూ !'

'ఓ. అంతకన్నానా.'డాక్టరు తలవంచుకుని కారువైపు అడుగులు వేసింది. కమలభర్త శేఖరాన్ని కారుదాకా తీసుకు వెళ్ళాడు. అప్పగింతల్లో పిల్ల నందించినట్లు శేఖరాన్ని డాక్టరుకు అప్పచెప్పాడు.

'రండి కూర్చోండి!' శేఖరం కారు వెనక తలుపుతీసి కూర్చోబోయాడు.

"అక్కడకాదు ... ముందు"

తప్పలేదు శేఖరానికి. ఆమె కారు డ్రైవ్ చేసింది. వానతుంపరలు దూసుకుంటూ కారు నడుస్తోంది.

"ఊళ్ళోవుండి కనిపించడం మానేశారన్న మాట !"

"ఎందుకు కనిపించాలి ?"

"స్నేహంకోసం"

"మనకి స్నేహం లేదు; శత్రుత్వం వుంది !"

"అదే... దేనికో !" నవ్వింది డాక్టరు. శేఖరంలో మౌనం.

"ఇంకా ఎందుకు కోపం ! జరిగిన సంగతులు విస్మరించి జీవితం సరదాగా గడపాలి అది నీకు బాగా తెలుసునని నేననుకునే దాన్ని... కాని" ఆమె నవ్వేసింది.

"నిన్ను చూడదలచుకోలేదు నిన్ను చూస్తేనా ఆరోగ్యంచెడి, నీ ఆస్పత్రిలో రోగిగా బ్రతకవలసి వస్తుంది."

"శేఖరం, జీవితంలో పెళ్ళి ముఖ్యంకాదు... స్నేహం ముఖ్యం నా జీవితం నేను సరిదిద్దుకోవద్దూ"

"అవును నాదే తప్పు"

"ఇదిగో చూడు నువ్వు ఏకాంతనో దగ్గరికి తీసుకుంటే సగం నా మీది కోపం పోతుంది."

"మనసులోని నిశ్చయాలకు- వ్యతిరేకంగా నీలా ప్రవర్తించలేను !"

"ఊఁ..." పక పక నవ్వింది... "అయితే ఆ అమ్మాయిని ఎరుగుదువా ?"

"ఎవరు ?... కమలా ?

"అవును..."

"ఆ ఎరుగుదును"

"ఎలా..."

"నీలాగే... నువ్వు నన్ను తిరస్కరించావు... నేను కమలను తిరస్కరించాను... నీకు నేనంటే జాలి... అలాగే నాకు ఆమె అంటే జాలి... రమ్మని చూడమంటే వాళ్ళ యింటికి వెళ్ళాను..."

"పాపం! అమ్మాయిని పెళ్ళిచేసుకునిఉంటే ఎంత బాగుండేది!" నవ్వింది డాక్టరు.

"అవునుడాక్టర్! చేసుకుంటాను... కాని నాలోఉన్న అగ్ని హతమార్చాలి. నిన్ను హత్యచేస్తే, అది చల్లబడు తుంది. ఆ తర్వాత శాంతంగా! జీవచ్ఛవంలా సంసార జీవితం ఎవరితోనైనా గడపగలను!"

"ఇప్పుడు హత్య చెయ్యకూడదూ..." మరీ గట్టిగా నవ్వింది డాక్టరు. ఆ నవ్వు విసురులో కారు వక్రంగా తిరిగి ఎదురుగావచ్చే లారీకి గుద్దుకున్నంత పని అయింది. తెలివిగా కారు స్టీరింగు కంట్రోలు చేసింది డాక్టరు.

"హమ్మయ్య!" నిట్టూర్చింది డాక్టరు. "మనిద్దరి హత్య జరిగే ప్రమాదం తప్పింది!"

"ఆపు కారు...దిగాలి..."

"మా యింటికి రండి...?"

"నేను రాను"

"రావాలి" డాక్టరు కారు వేగంగా నడుపుతోంది.

"నేను ఉరికేస్తా" శేఖరం అరిచాడు కారు తలుపుతీసి.

డాక్టరు ముఖం కందగడ్డలా మారింది. ఏదో అవమానంతో కుంచించుకు పోయింది. తక్షణం కారు ఆపింది.

'థాంక్స్' శేఖరం వెళ్ళిపోయాడు.

"గుడ్ నైట్" వెళ్ళిపోతున్న శేఖరం వైపుచూసింది. శేఖరం ఆమాట తలుస్తూ నిశీథంలో కలిసిపోయాడు.

*　　*　　*　　*

కమల పత్యం పుచ్చుకుంది. తాను పట్టిన కేసు విజయం పొందిందని డాక్టరు చాలా సంతోషించింది. కమలను చూడడానికి వచ్చిన శేఖరం, డాక్టరు తరుచు సమావేశమై, మనసులు సరిదిద్దుకుని స్నేహభావం పెంచుకున్నారు.

ఒకరోజు కమల సాయంత్రం కాంపౌండులోని తోటలో కూర్చుని చల్లగాలి పీలుస్తోంది. ఆమె నీరస శరీరమువో యింకా తగిన శక్తి కోలుకోలేదు. కాంపౌండులోకి వచ్చి ఆగిన కారులోంచి డాక్టరు, శేఖరం దిగారు. తెల్లటి సిల్కు-చీర, రవికలో, మల్లెపూల ఘుమఘుమలో ఆమె ఆనాడు అపురూప అందకత్తెలా వుంది. సాధారణంగా తన దుస్తులు గూర్చి ఎక్కు- పట్టించుకోని శేఖరం వులెన్ సూట్ లో నీటుగా కనిపించాడు. దంపతుల్లా దిగిన వారిద్దరినీ చూడగానే కమల మనస్సులో ఏవో అనుమాన బీజాలు పొడసూపాయి. డాక్టరు మందస్మితంగా పలకరించినా, కమల ముక్తసరిగా సమాధాన మిచ్చింది.

"సినీమాకి టైమయింది" అంటూ డాక్టరు కారు ఎక్కింది. నవ్వుతూ శేఖరం అనుసరించాడు.

"మీరూ వెడుతున్నారా సినిమాకి!" శేఖరాన్ని ప్రశ్నించింది కమల.

"అవును టాటా" అంటూ కారులో కూర్చున్నాడు శేఖరం.

కమల బుర్రలో ఏదో పెనుతుఫానులా ఆలోచనలు కదిలాయి అంతలో అంత చనువు పెంపొందించుకోవడం ఆమెకు ఎంతో ఆశ్చర్యం కలిగింది.

"కమలా! క్షమించు!... నేను నిన్నెంత యిష్టపడినా పెండ్లిచేసుకోలేను... నాజీవితంలో ఉన్న అసంతృప్తి ఎవరూ తీర్చలేరు..."

ఒకప్పుడు శేఖరం అన్నమాటలు కమల చెవుల్లో రింగుమన్నాయి.

"ఎవరినో యింతకుముందు ప్రేమించి ఉండి ఉంటాడని ఆమె నిర్ణయించుకుంది. మొదటిసారి తన జబ్బులో చూసిన శేఖరానికి, తన జబ్బు పూర్తయాక కనిపించే శేఖరానికి సహస్రం తేడా కనిపించింది కమలకు.

తన జీవితంలో అశాంతి కలగచేసిన "స్త్రీ ఈమేనా? శేఖరందృష్టి ఆకర్షించి అతన్ని మతిలేనివాడిగాచేసి, మరో పెళ్ళిచేసుకుని, శేఖరం తనకు దక్కని పరిస్థితి కల్పించిన స్త్రీ ఈమేనా, అటువంటి స్త్రీ తనకు వైద్యంచేసి ప్రాణం కాపా

డింది... వైద్యం చెయ్యకపోయినా బాగుండేది... అనుకుంది ఛీ... ఈమె చేతుల్లోనా నేను బ్రతికింది... కమలబాధ పెరిగింది.

ఇంట్లోకి నడిచింది. టేబిలుమీద వుందు సీసా చూసింది. ఏదో ఉద్రేకోపంతో ఎత్తి కోపంతో నేలమీదకు విసిరికొట్టింది. సీసా పగిలి శబ్దంతో ముక్కలయ్యింది. ఆ చప్పుడు విని యింట్లోంచి లేచివచ్చి ఏమిటని ప్రశ్నించింది తల్లి....

"చెయ్యినుంచి జారింది!..." తలవంచుకుంది కమల. తల్లి సణుగుకుంది. ఇంట్లోనిదాసి ఆ గాజుసీసా పెంకులు పోగుచేసి తుడిచేసింది. తల్లి, దాసి, వసారా విడిచి వెళ్ళిపోయారు. కమల ఒంటరిగా నిట్టూరుస్తూ కూర్చుంది... ఏమీతోచక ఏడ్చింది...

ఇక ముందు అవసరంలేదని డాక్టరు, కమల యింటికి రావడం మానేసింది. శేఖరంకూడా కన్పించలేదు వారం రోజులు. శేఖరానికి ఉత్తరం రాసింది కమల. జవాబు రాలేదు. శేఖరమైనా యింటికి రాలేదు.

ఒకరోజు మాటల సందర్భంలో తండ్రి చెప్పాడు. శేఖరం, లేడీ డాక్టరు హోటల్లో కనిపించారని, కమల నీరసంగా వుందంటే టానికులు తీసుకోమంది డాక్టరు అన్నాడు తండ్రి.

కమలలో ఏదో అసూయాగ్ని ప్రజ్వరిల్లినది. మనస్సు బాధతో కుమిలిపోయింది రాత్రి అన్నం తినలేదు.

నిద్రమాని ఏదో వ్యథతో ఏడ్చింది కమల. మర్నాడు కమలకు జ్వరం వచ్చింది. ఏదో మూగమనిషిలా మాటాడ్డం మానేసింది అంతలోనూ కమల తండ్రి లేడీ డాక్టరుని తీసుకువచ్చాడు. ఆమె మందు యిచ్చింది. కమల తీసుకోలేదు. తల్లి కసిరింది. తండ్రి కోప్పడ్డాడు. లేడీడాక్టరు మందలించింది. ఈ సారి కమల శేఖరాన్ని చూడడానికి రమ్మని ఉత్తరం రాయలేదు.

కమలకు జ్వరం తీవ్రత హెచ్చింది. ఆ తీవ్రతలో ఆమెకు స్పృహ తప్పింది.

డాక్టరు ఇంజక్షను యిచ్చింది. తల్లిదండ్రులకు యథాప్రకారం ధైర్యం చెప్పింది.

డాక్టరుద్వారా కమల ఆరోగ్యం సంగతి విన్న శేఖరం ఆమెను చూడడానికి వెళ్ళాడు.

విషజ్వరం కమలపై పూర్తిగా మైకం కమ్మింది. సంధి ప్రేలాపన ప్రారంభించింది. వెర్రిచూపులతో శేఖరం ఎదురుగా నిల్చున్నాడు. అతనిమీద కసి మింగుకోలేక, వెళ్ళగ్రక్కలేక, కమల తలిదండ్రులు స్తంభించుకు పోయారు.

కూతురు ప్రేలాపనలో... తమగుర్తు ఏమీలేక శేఖరం గురించి పలవరించడం వారికి మరీ ఉక్రోషం కలిగింది.

ఆరోజు రాత్రి పదిగంటలకు కమల పరిస్థితి ఆందోళనకరమైంది. డాక్టరు పరీక్షించి పెదవి విరిచింది... తలవంచు

కుని వెళ్ళిపోతూ శేఖరాని వెంట రమ్మని పిలిచింది. శేఖరం కదలలేదు...

డాక్టరు వెళ్ళిపోయింది కారులో. ఆమె కారుహారను వెను వెంటనే కమల యింట్లో రోదనలు మిన్నుముట్టాయి.

శేఖరం యిల్లు విడిచి బయటికి వచ్చేశాడు. చీకట్లో నడుస్తోంటే చెట్ల ఆకులు ఏవో ధ్వనులతో కదిలాయి. 'శేఖరం... శేఖరం...' ఆ ధ్వనుల్లోంచి కమల మాటలు వినిపించాయి. గాలిలో చెట్ల ఆకులకు దూరంగా కదిలే మేఘాల ఆకారంలో కమల ముఖం కనిపించింది

'నన్ను తిరస్కరించు... కాని నిన్ను మర్చిపోలేను శేఖరం...చనిపోతూ నిన్నే స్మరిస్తా!' కమల ఒకస్సారి ఏడుస్తూ అన్నమాటలు శేఖరం హృదయంలో ప్రతిధ్వనించాయి.

కమల నిజాయితీ, డాక్టరు స్నేహంద్వారా యిచ్చే మాధుర్యం, రెండూ పొందిన శేఖరం తాను అదృష్టవంతుడ ననుకున్నాడు, నడుస్తూ. ఎదురుగా దారి కనిపిస్తోంది... వక్రంగా... వీధిలోని గుడ్డి వెల్తురులో.

.